క్లుప్తంగా

శంబలనగరి సందర్శన



గాయత్రీమాతను దర్శించుకుంటున్న ఆర్‌ఎస్‌ఎస్ నేత రాంమాధవ్

శృంగవరపుకోట: మండలంలోని భర్తాపురం గ్రామ ఎస్టీ కాలనీ సచివాలయం పరిధిలోని శంబలనగరి ఆశ్రమాన్ని ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు రాంమాధవ్ ఆదివారం సందర్శించారు. గాయత్రీ మాతను దర్శించుకున్నారు. ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు ఆశ్రమ విశిష్టత, ప్రత్యేకతలను వివరించడంతో పాటు అమ్మవారి శేషవస్త్రాన్ని అందజేశారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రతీ ఆదివారం మాదిరిగానే ఈవారం కూడా అమ్మ వారికి అర్చకులు పంచామృతాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెలమ సంఘం ప్రతినిధులు

శృంగవరపుకోట: కొప్పల వెలమ సంక్షేమ సంఘం 2024 క్యాలెండర్‌ను మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆ సంఘం ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. కొప్పల వెలమల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. మండల వెలమ సంఘం ప్రతినిధి, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు అల్లు సుధీర్ బాబు, సంఘం ప్రతినిధులు అల్లు కిట్టుబాబు, శ్రీను, సూర్యారావు, మహాలక్ష్మునాయుడు, సత్యారావు, కరక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు ఎంపీడీఓకు బదిలీ

దత్తిరాజేరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)ఎం.బి.బి.సుబ్రహ్మణ్యం శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు ఆయన్ని ఇక్కడ నుంచి బదిలీ చేశారు.

రూ.98 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం



మజ్జిపేటకు వేసిన తారు రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద పంచాయతీలోని మజ్జిపేట గ్రామానికి గొభ్యాం నుంచి 1.5 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. గతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు గ్రామస్తులు సమస్యను వివరించారు. గ్రావెల్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేందుకు వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని, తారు రోడ్డు మంజూరు చేయాలని ఆయన్ని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ బీటీ రోడ్డు నిర్మాణానికి ఏపీ పీఆర్ఆర్‌పీ నుంచి రూ.98.60 లక్షలు మంజూరు చేయించారు. ఈనిధులతో 1.5 కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేశారు. రోడ్డు పరిధిలో మూడు చోట్ల కల్వర్టులు నిర్మించారు. దశాబ్దాల కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాకారం కావడంతో గ్రామస్తులు, సర్పంచ్ గుజ్జ మంగ, ఎంపీటీసీ నాగి రెడ్డి సత్యం, ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ సామిరెడ్డి కుమార్‌నాయుడు ఆనందం వ్యక్తం చేశారు.

మహిళలకు ఆర్థిక 'ఆసరా'

- సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం
- పార్టీలకతీతంగా పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌దే..
- టీడీపీ దుష్ప్రచారం, మోసపూరిత హామీలను నమ్మవద్దు
- వేపాడలో నిర్వహించిన ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు



ఆసరా సంబరాలకు హాజరైన లబ్ధిదారులు

వేపాడ: ప్రతీ మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వెలుగు ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకం, అమ్మఒడి, తదితర పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా ఎస్.కోట నియోజకవర్గంలోని 5,389 డ్వాక్రా సంఘాల్లోని 61, 966 మంది సభ్యుల ఖాతాల్లో నాలుగు విడతల్లో రుణ మాఫీ నిధులను రూ.142.80 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమచేసిందని చెప్పారు. డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని 2014 ఎన్నికల్లో చెప్పి టీడీపీ అధికారంలోకి వచ్చిందని, ముఖ్యమంత్రి అయిన తర్వాత మహిళలకు రుణమాఫీ చేయకుండా చంద్రబాబునాయుడు ఏవిధంగా మోసం చేశారో గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని, ప్రతీ ఇంటికి ఏదో ఒక మేలు జరిగిందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చడంతో పాటు సదుపాయాలు మెరుగుపరిచామని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాల ద్వారా వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని వివరించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలు రూ.25 లక్షల వ్యయపరిమితి వరకు ఉచితంగా వైద్యం చేయించుకునే అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారన్నారు.

అవినీతి రహిత సంక్షేమ పాలన

రాష్ట్రంలో అవినీతి రహిత సంక్షేమ పాలన సాగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ పారదర్శకంగా గ్రామాల్లోనే అందుతున్నాయని చెప్పారు.అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దాచుకో, దోచుకో విధానం సాగిందని, అవ్వా,తాతలకు పింఛన్ మంజూరు చేసేందుకు సైతం జన్మభూమి కమిటీలు లంచాలు వసూలు చేశాయని గుర్తు చేశారు. ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపుతట్టి అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ అందిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వాల్లో ఎప్పుడైనా ఎమ్మెల్యే ఇంటింటికీ వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారా అని ప్రజల ను ప్రశ్నించారు. సీఎం జగన్ ఆదేశాలతో ప్రతి గడపకూ వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశానని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి అబద్ధాలు, మాయ మాటలు చెబుతారని, వారి మాటలను నమ్మవద్దని, గతంలో అధికారంలో ఉన్నప్పుడు మీరు ఏం చేశారో చెప్పాలని వారిని నిలదీయమని ప్రజలకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తూ, ప్రతీ ఇంటికి మేలు చేసిన ప్రభుత్వం ఇది అని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, మండల సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకట రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.ఉమ, వెలుగు ఏసీ ఆదియ్య, ఏపీఎం శ్రీనివాసరావు, మండల జేసీఎస్ కన్వీనర్ బి.శ్రీను, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రూ.7లక్షలు జమయ్యాయి..



వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మా సంఘానికి నాలుగు విడతల్లో రుణమాఫీ కింద రూ.7,23,760 జమయ్యాయి. అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా ఆర్థికంగా లబ్ధిపొందాం. పాఠశాలల్లో పిల్లలకు రోజుకో మెనూతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఆర్.నాగదేవి, లబ్ధిదారు, చామలాపల్లి గ్రామం

ఆర్థికంగా ఆదుకున్నారు..



డ్వాక్రా సంఘాల సభ్యులను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా సీఎం జగన్ ఆర్థికంగా ఆదుకున్నారు. మాసంఘానికి నాలుగు విడతల్లో రుణమాఫీ నిధులు రూ.7 లక్షలు జమయ్యాయి. నాకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.56,250 అందింది. మాఇంట్లో వృద్ధులకు పింఛన్ వస్తోంది, రైతుభరోసా అందింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది.

– భాగ్యలక్ష్మి, లబ్ధిదారు, గదబవలస గ్రామం

మహిళలకు అండగా నిలిచారు



మా సంఘానికి ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రుణమాఫీ కింద రూ.7.40 లక్షలను ప్రభుత్వం జమచేసింది. ఈ సహాయానికి తోడు సున్నా వడ్డీ పథకం అమలు చేస్తుండడం వల్ల మాపై రుణభారం తగ్గింది. ఆసరా, చేయూత, జగనన్న తోడు తదితర పథకాల ద్వారా మహిళలకు ఈ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వసేవలు, పథకాలు ఇంటివద్దనే అందుతున్నాయి.

– ప్రభావతి, లబ్ధిదారు, చినగుడిపాల గ్రామం

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



'ఆడుదాం-ఆంధ్రా' నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన చీపురుపల్లి సచివాలయం-4 జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: క్రీడల్లో రాణించే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. 'ఆడుదాం-ఆంధ్రా' నియోజక వర్గస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన చీపురుపల్లి సచివాలయం-4 జట్టుకు ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ట్రోఫీ అందజేశారు. విజేత జట్టును అభినందించారు. త్వరలో నిర్వహించనున్న జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి 'ఆడుదాం-ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలు ఏర్పాటు చేశారని జెడ్పీ చైర్మన్ చెప్పారు. ఎంపీడీఓ జి.గిరిబాల, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇప్పిలి గోవింద, కోరుకొండ దాలయ్య, రేవల్ల సత్తిబాబు, రఘుపాత్రుని శ్రీను, బొంతు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు చీపురుపల్లిలో ఆసరా సంబరాలు

చీపురుపల్లి: మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ సమీపంలో సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే సోమవారం ఉదయం 10 గంటలకు చీపురుపల్లి సచివాలయం-3 పరిధిలో రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రాల భవనాలను మంత్రి బొత్స ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆసరా సంబరాల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మండల స్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు ఈనెల 31న నిర్వహించనున్నారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో పర్ణశాల సమీపంలో సంబరాల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసరా సంబరాలకు మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు 10వేలకు పైగా హాజరు కానున్నారని చెప్పారు. సభకు వచ్చిన వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భోజన సదుపాయం కూడా కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ నాయకులు బెల్లాన త్రినాథరావు, మంత్రి అప్పలనాయుడు, కె.రామునాయుడు, వెలుగు ఏపీఎం యు.జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన మామిడి పూత



ఎల్.కోట మండలం భీమాళిలో పనుకులు రకం చెట్టుకు విరగబూసిన పూత

కొత్తవలస/ లక్కవరపుకోట: కొత్తవలస, ఎల్.కోట మండలాల్లోని పలు గ్రామాల్లోని మామిడి తోటల్లో పనుకులు రకానికి చెందిన చెట్లు పూత విరగబూసాయి. ఆకులు కూడా కనిపించని రీతిలో పూత రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంచు, తెగుళ్లకు పూత మాడిపోయి రాలిపోకుండా నిలబడితే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

జోరుగా ఉపాధి హామీ పనులు



వెంకటాపురంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

గజపతినగరం: మండలంలోని గజపతినగరం, దావాలపేట, పురిటిపెంట, కాలంరాజుపేట, పిడిశీల, భూదేవి పేట, బంగారమ్మపేట, కొత్తభగ్గాం,పాతభగ్గాం, ఎం.గుమ డాం, మరుపల్లి,లోగిశ, జిన్నాం, ఎం.కొత్తవలస, రంగుపురం, తుమికాపల్లి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఫారం పాండ్‌లు, చెరువులు, సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులను వేతనదారులు చేపడుతున్నారు. ప్రస్తుతం సుమారు 2,500 మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారని ఉపాధి హామీ పథకం ఏపీఓ రామారావు చెప్పారు. ఒక్కో ఫారం పాండ్‌లో 10వేల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ ఉండేలా, మండలంలో 110 ఫారం పాండ్‌లను తవ్వించడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. ఎం.వెంకటాపురం, లోగిశ, రంగుపురం, ఎం.కొత్తవలసతో ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. వేతనదారులకు గిట్టుబాటు వేతనం అందేలా పనులు చేయిస్తున్నామని, రెండురోజుల్లో అన్ని పంచాయతీల్లోని వేతనదారులకు పనులు కల్పిస్తామని చెప్పారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామంలో కె.ఆదినారాయణ తన నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 24 మద్యం బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నామని పెదమానాపురం ఎస్ఐ శిరీష తెలిపారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి నిందితుడి ఇంటిలో సోదాలు చేసి, మద్యం సీసాలను పట్టుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

బొండపల్లి/దత్తిరాజేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించి అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లాలోని భీమిలి నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన 'సిద్ధం' సభ విజయవంతమైందని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి హాజరైన ఈసభకు పార్టీ ఊహించిన దానికంటే పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న సీఎం జగన్ వెంటే ప్రజలు ఉన్నారని, ఈసభతో స్పష్టం కావడంతో ప్రతి పక్షాలకు ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలు, ఎల్లోమీడియా దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని తేటతెల్లమైందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ప్రజావిశ్వాసాన్ని సీఎం జగన్ చూరగొన్నారని పేర్కొన్నారు. 'సిద్ధం'సభను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కార్యకర్తలు, నాయకులను కోరారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



హోరాహోరీగా కబడ్డీ పోటీలు

శృంగవరపుకోట: పట్టణంలోని డాక్టర్ వరలక్ష్మి సీబీఎస్ఇ స్కూల్ క్రీడా మైదానంలో 'ఆడుదాం-ఆంధ్రా' నియోజకవర్గస్థాయి కబడ్డీ ఫైనల్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ఈపోటీల్లో ఎస్.కోట జట్టు విజేతగా నిలిచింది. ఎల్.కోట జట్టు ద్వితీయ స్థానం, కొత్తవలస జట్టు తృతీయస్థానాలు సాధించాయని మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీరాములు తెలిపారు.

బల్లంకిలో ఎడ్ల పరుగు పోటీలు



పోటీలను తిలకిస్తున్న ప్రజలు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో మరిడిమాంబ తీర్థం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీల్లో వల్లంపూడి సిద్ధివినాయక ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎద్దులు, తృతీయ స్థానంలో లక్కవరానికి చెందిన బాలబోయిన మహేష్ ఎద్దులు, నాలుగోస్థానంలో వావిలపాడుకు చెందిన గండివెంకటరావు ఎద్దులు, అయిదో స్థానంలో దేవరపల్లికి చెందిన జై వీరాంజనేయ ఎద్దులు నిలిచాయి. విజేతలకు సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి, నాయకులు కనకరాజు, ఉపసర్పంచ్ ధనుంజయ్, వార్డుమెంబర్లు గ్రామపెద్దలు నగదు బహుమతులు అందజేశారు.

జానపదం సజీవం

విజయనగరం టౌన్: జానపద వాఙ్మయమనేది ఎప్పటికీ సజీవంగా ఉంటుందని గిడుగు రామమూర్తి తెలుగు భాషా, జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు అన్నారు. విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో జానపద సాహితీ సౌరభం కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వక్తగా హాజరైన ఆయన జానపథంలో జానపద సాహిత్యం అనే అంశంపై మాట్లాడుతూ, ఆచార్య వెలమల సిమ్మన్న చెప్పినట్లు మానవ వికాసం ప్రాథమిక దశలోనే జానపద వికాసం ప్రారంభమైందన్నారు. అనంతరం కూర్మారావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. గోపాలరావు, కొంకెపూడి అనురాధ, వారణాసి వెంకట నరసింహమూర్తి , దశగ్రంథాల వెంకట సుబ్రహ్మణ్యం, డాక్టర్ జక్కు రామకృష్ణ, భోగరాజు బాబూజీ, సూర్యలక్ష్మి, దామరాజు శంకరం, డాక్టర్ శ్రీకాంత్ సోమేశ్వరరావు సంతోష లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.